
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 జూన్ 2024




రేపు సత్తిరాజు సంస్మరణ సభ


సత్తిరాజు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - పాలకొల్లు

సత్తిరాజు సంస్మరణ సభ ఈనెల 19వ తేదీన ఆయన స్వగ్రామం పాలకొల్లు మండలం అరట్లకట్టలో జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు తెలిపారు. సత్తిరాజు తుదిశ్వాస విడిచే వరకు నిస్వార్థంగా, క్రమశిక్షణతో పార్టీ నిర్ణయాల అమలుకు పనిచేశారని, గ్రామంలో పేదలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై పనిచేశారని తెలిపారు. సిపిఎం నాయకులుగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులుగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకోవడానికి ఈ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ సంస్మరణ సభలో సభ్యులు, సానుభూతి పరులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొంటారని తెలిపారు.



'పోలవరం'ను దెబ్బతీశారు

ప్రాజెక్టు ప్రాంతంలో సిఎం చంద్రబాబు విస్తృత పర్యటన - దెబ్బతిన్న డయాఫ్రం వాల్, కాపర్‌డ్యామ్, గైడ్‌బండ్ పనుల పరిశీలన

పోలవరం పూర్తి చేయాలంటే మరో నాలుగు సీజన్లు - అదనంగా మరో రూ. మూడు వేల కోట్లకుపైగా భారం

గత ప్రభుత్వ అధినేత రాష్ట్రానికి శాపంగా మారారు : సిఎం చంద్రబాబునాయుడు

నిర్వాసితుల సమస్యలపై సిఎంకు సిపిఎం బృందం వినతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, పోలవరం

రాజకీయాల్లో ఉండకూడని వ్యక్తి వచ్చి రాష్ట్రానికి శాపంగా మారారని, రాష్ట్రానికి జీవనాడి వంటి పోలవరం ప్రాజెక్టును దెబ్బతీయడమే అందుకు నిదర్శనమని సిఎం చంద్రబాబు అన్నారు. సిఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తన తొలిపర్యటనగా చంద్రబాబు సోమవారం పోలవరం విచ్చేశారు. ఉదయం 11.55 గంటలకు హెలీకాప్టర్‌లో పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకున్నారు. ముందుగా ఏరియల్ సర్వే ద్వారా ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం హెలీప్యాడ్‌కు చేరుకున్న సిఎంకు మంత్రులు, ఎంఎల్ఎలు, నాయకులు, అధికారులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు పెద్దఎత్తున తరలొచ్చారు. అనంతరం కొండపై ఉన్న వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టును పరిశీలించారు. అక్కడ నుంచి బస్సుపై రోడ్డుమార్గం గుండా ప్రాజెక్టు పనులు పరిశీలించారు. ముందుగా స్పిల్‌వే ప్రాంతంలో రెండు చోట్ల, ఎగువ, దిగువ కాపర్‌డ్యామ్‌ల పనులు, దెబ్బతిన్న డయాఫ్రంవాల్, పవర్‌స్టేషన్ పనులను సిఎం పరిశీలించారు. ఆయన పరిశీలించిన ప్రతి పాయింట్ వద్దా పనుల ప్రగతికి సంబంధించి అధికారులు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి పనుల తీరును సిఎంకు వివరించారు. దాదాపు గంటన్నరపాటు మండుంటెండలో సిఎం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. రెండు గంటలకు కొండపైకి చేరుకుని మధ్యాహ్న భోజన అనంతరం ప్రాజెక్టు పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఈ విధంగా దెబ్బతింటే గత ప్రభుత్వానికి మీరు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. దీంతో


ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న చంద్రబాబు

తాము అప్పట్లో లేమంటూ చాలా మంది అధికారులు సమాధానం చెప్పినట్లు తెలిసింది. ప్రస్తుత పరిస్థితి ఏమిటీ, ఎలా ముందుకెళ్లాలి, దెబ్బతిన్న పనులు పూర్తి చేయడానికి ఎంతకాలం పడుతుందని అధికారులను సిఎం ప్రశ్నించినట్లు సమాచారం. దెబ్బతిన్న పనులు పూర్తి చేయాలంటే నాలుగు సీజన్లు పడుతుందని అధికారులు చెప్పినట్లు తెలిసింది. దీనిపై మరింత పరిశీలన చేయాలంటూ చంద్రబాబు సూచించినట్లు సమాచారం. అనంతరం విలేకరుల సమావేశంలో సిఎం మాట్లాడారు.


వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టును తిలకిస్తున్న చంద్రబాబు

ప్రాజెక్టును చూస్తే బాధ వస్తోంది..!

చైనాలోని త్రీగోర్జెస్ కన్నా పోలవరం ప్రాజెక్టు అధికస్థాయిలో నీటి విడుదల సామర్థ్యం గలదని, అయితే ప్రస్తుతం ప్రాజెక్టు పరిస్థితి చూస్తే బాధ వస్తుందని సిఎం చంద్రబాబు అన్నారు. 194 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం, 320 టిఎంసిల వరకు వరద నీటిని వినియోగించుకోగలిగే అవకాశం ఉందన్నారు. నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు పోలవరం ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేశానన్నారు. పోలవరం ప్రాజెక్టుపై వందకుపైగా సమీక్షలు, 31 సార్లు క్షేత్రస్థాయిలో ప్రాజెక్ట్ పనులను పరిశీలన చేశామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.13,683 కోట్లు ఖర్చు చేసి 72 శాతానికి పైగా పనులు పూర్తి చేశామన్నారు. అదే వేగంతో పనులు పూర్తి చేసి ఉంటే 2020 చివరి నాటికే పోలవరం ప్రాజెక్ట్ పూర్తయ్యి ఉండేదన్నారు. గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ విధానంలో ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆపేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్‌కు రూ.7,100 కోట్లకు కేటాయింపులు తగ్గించి, అదీ కాంట్రాక్టర్లకు అడ్వాన్సులుగా చెల్లించారన్నారు. తమ హయాంలో రూ.446 కోట్లతో డయాఫ్రమ్ వాల్ నిర్మించామని, గత ప్రభుత్వం అధికారంలోకి రాగానే పనులు పూర్తి చేయనీయకుండా కాంట్రాక్టర్‌ను మార్చడం, అప్పటివరకు పని చేసిన ఇంజినీరింగ్ సిబ్బంది అందరినీ మార్చివేశారన్నారు. కాంట్రాక్టర్‌ను, ఇంజినీరింగ్ అధికారులను మార్చొద్దని కేంద్ర జలసంఘం అధికారులు చెప్పినప్పటికీ గత ప్రభుత్వం వినలేదన్నారు. 2019, 2020లో వచ్చిన అధిక వర్షాల కారణంగా డయాఫ్రమ్ వాల్ నాలుగుచోట్ల 35 శాతం దెబ్బతిందన్నారు. డయాఫ్రమ్ వాల్ మరమ్మతుకు రూ.447 కోట్లు ఖర్చవుతాయని, అయినప్పటికీ పూర్తిగా మరమ్మతు అవుతుందని నమ్మకం లేదని అన్నారు. డయాఫ్రమ్ వాల్ సమాంతరంగా కొత్తది నిర్మించాలంటే రూ.996 కోట్లు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారన్నారు. కాపర్‌డ్యామ్ గ్యాప్ పనులు పూర్తి చేయాలంటే మరో రూ.రెండు వేల కోట్లు అవ్వొచ్చన్నారు. దీనికోసం నాలుగు సీజన్లు అంటే నాలుగేళ్ల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారన్నారు. రూ.వేల కోట్లు ప్రజాధనం వృథా చేశారన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలు పోలవరం ప్రాజెక్ట్ పాలిట శాపాలుగా మారాయన్నారు. పనులను ఎంత సంక్లిష్టం చేయాలో అంతా చేసి ప్రాజెక్ట్‌ను పనికిరాకుండా చేశారన్నారు. ఇది క్షమించరాని నేరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎంఎల్ఎలు చిర్రి బాలరాజు, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, ఆరిమిల్లి రాధాకృష్ణ, సొంగా రోషన్‌కుమార్, పితాని సత్యనారాయణ, జ్యోతుల నెహ్రూ, వసంత కృష్ణ ప్రసాద్, నిమ్మకాయల చినరాజప్ప, బొలిశెట్టి శ్రీనివాస్, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇరిగేషన్ శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబుతో మంత్రి పార్థసారథి, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్, ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

సిఎం చంద్రబాబుకు, మంత్రులకు సిపిఎం బృందం వినతి

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై సిపిఎం జిల్లా కమిటీ సిఎం చంద్రబాబుకు, మంత్రులకు వినతిపత్రాలు అందించినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితుల త్యాగాల పునాదులపై పోలవరం ప్రాజెక్టు నిర్మిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నా ఆచరణలో నిర్వాసితులకు పునరావాసం, సమస్యలపై దృష్టి సారించడం లేదన్నారు. ప్రభుత్వాలన్నీ ఇదే వైఖరి అవలంబించడం దారుణమన్నారు. 15 ఏళ్లలో ప్రాజెక్టు నిర్మాణం 75 శాతానికిపైగా పూర్తవ్వగా పునరావాసం మాత్రం పది శాతం కూడా మించలేదని అన్నారు. పునరావాసం కల్పించిన వారికి సైతం సౌకర్యాల్లేక విలవిల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో ముంపనకు గురయ్యే ప్రాంతాలను ప్రభుత్వాలు అశాస్త్రీయంగా గుర్తించాయని, 2022 జులైలో వచ్చిన వరదల్లో 41.5 కాంటూరు పైబడిన గ్రామాలు సైతం మునిగిపోయాయని గుర్తు చేశారు. ఏలూరు జిల్లాలో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 25 వేల కుటుంబాలు, లక్ష మంది నిర్వాసితులవుతున్నారని తెలిపారు. వీరిలో అత్యధికులు గిరిజనులేనని, వీరికి పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో పునరావాస కాలనీలు నిర్మించారని తెలిపారు. ఈ కాలనీల్లో సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయని, ఒక్క కుటుంబానికీ పునరావాసం పూర్తిస్థాయిలో కల్పించలేదని తెలిపారు. సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు వినతులిచ్చినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ చట్టాలు, 2013 భూసేకరణ చట్టం అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు శ్రద్ధ వహించి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నిర్వాసితులకు పునరావాసం కల్పించాకే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఖాళీ చేయించే రోజునే కటాఫ్ తేదీగా నిర్ణయించి 18 ఏళ్లు నిండిన వారికి ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, గృహనిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు, జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్ర, దుర్గారావు, మండల కమిటీ సభ్యులు సముద్రాల సాయికృష్ణ, నిర్వాసితుల కమిటీ సభ్యులు తాటి శాంతి పాల్గొన్నారు.


మంత్రి నిమ్మలకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం బృందం

నిర్వాసితుల పునరావాస సమస్యలు పరిష్కరించాలి

రైతు కూలీసంఘం రాష్ట్ర మహాసభ డిమాండ్

నూతన కార్యవర్గ ఎన్నిక - ముగిసిన మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పోలవరం నిర్వాసితుల పునరావాస తదితర సమస్యలను తక్షణం పరిష్కరించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. మూడు రోజులపాటు స్థానిక టుబాకో మర్చంట్స్ అసోసియేషన్ హాలులో జరిగిన రాష్ట్ర మహాసభ చివరి రోజు సోమవారం పలు తీర్మానాలు ఆమోదించడంతోపాటు నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమై రెండు దశాబ్దాలు గడిచినప్పటికీ ప్రాజెక్టులో సర్వస్వం కోల్పోయిన లక్షలాది మంది గిరిజన, గిరిజనేతర పేద ప్రజలకు నేటికీ న్యాయం జరగలేదన్నారు. పునరావాస కాలనీల్లో నిర్వాసితులు జీవనోపాధి కోల్పోయి, వలస కూలీలుగా దుర్భర పరిస్థితుల్లో బతుకుతున్నారని తెలిపారు. మొదటి ప్రాధాన్యతగా నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, భూమికి భూమి కొనుగోలు చేసి ఇచ్చేందుకు ప్రభుత్వం గిరిజనులతో చేసుకున్న ఒప్పందం అమలు చేయాలని, పునరావాస సమస్యలను పూర్తిగా పరిష్కరించాకే ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పునరావాసం నిర్వాసితులకు భిక్ష కాదని, అది ప్రజాస్వామిక హక్కు' అని, దానిని సాధించుకోవడానికి అంతా ఐక్యంగా పోరాడాలన్నారు. పలువురు నేతలు సభలో మాట్లాడారు.



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే చంద్రబాబు ధ్యేయం

మంత్రి పార్థసారథి, ఎంఎల్ఎలు వసంత కృష్ణప్రసాద్, చింతమనేని ప్రభాకర్ - దెందులూరులో ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేసి కూటమి ప్రభుత్వం కొలువు తీరాక రాష్ట్రంలో ప్రజలంతా ఒక పండగ వాతావరణంలా భావించి సంతోషంగా ఉన్నారని, ఆ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే చంద్రబాబు ధ్యేయమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, మైలవరం ఎంఎల్ఎ వసంత కృష్ణప్రసాద్, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని దెందులూరు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో వారి ఆత్మీయ కలయిక జరిగింది. దుగ్గిరాలలోని చింతమనేని ప్రభాకర్ క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన మంత్రి కొలుసు పార్థసారథికి, మైలవరం ఎంఎల్ఎ వసంత కృష్ణప్రసాద్‌కు చింతమనేని ప్రభాకర్ పుష్పగుచ్ఛాలు అందించి, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. దెందులూరు ఎంఎల్ఎగా గెలుపొందిన ప్రభాకర్‌ను వారిద్దరు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దెందులూరు నియోజకవర్గంలోని పార్టీ మండలాధ్యక్షులు సహా పలువురు నాయకులను చింతమనేని ప్రభాకర్ మంత్రి పార్థసారథికి పరిచయం చేశారు. అనంతరం గృహ నిర్మాణ శాఖకు చెందిన దెందులూరు నియోజకవర్గంలోని పలు అంశాలపై చింతమనేని ప్రభాకర్ మంత్రితో పార్థసారథితో చర్చించారు. తమ శాఖ ద్వారా దెందులూరు నియోజకవర్గానికి ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రి పార్థసారథి, ఎంఎల్ఎ వసంత కృష్ణ ప్రసాద్, చింతమనేని ప్రభాకర్‌లు పోలవరంలో జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పార్టీ దెందులూరు నియోజకవర్గ మండలాధ్యక్షులు బొప్పన సుధా, లావేటి శ్రీనివాస్, మాగంటి మిల్లు బాబు, నంబూరి నాగరాజు, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, మోతుకూరి నాని, నాయకులు పాల్గొన్నారు.


మంత్రి పార్థసారథిని సత్కరిస్తున్న ఎంఎల్ఎ చింతమనేని

దుర్గారావు సేవలు అభినందనీయం

సత్కరించిన ఇండియన్ బ్యాంక్ ఖాతాదారులు

ప్రజాశక్తి - మండవల్లి


ఖాతాదారులకు బ్యాంకు పరమైన సేవలందించడంతో పాటు సామాజిక స్పృహ కలిగి సేవలందించడంలో ఇండియన్ బ్యాంక్ మండవల్లి మేనేజర్ బొంతు దుర్గారావుకు సాటి ఎవరూ రారని పలువురు వక్తలు అన్నారు. బదిలీ అయిన ఆయనను స్థానిక ఇండియన్ బ్యాంకులో సోమవారం సిబ్బంది ఖాతాదారుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఖాతాదారులు మాట్లాడుతూ బొంతు దుర్గారావు బ్యాంక్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మేనేజర్ అనే గర్వం లేకుండా ఖాతాదారులతో మమేకమై సహృదయంతో మెలిగిన వ్యక్తి దుర్గారావు అని అన్నారు. అంతేకాకుండా గ్రామ గ్రామాన భీమా పథకాలపై అవగాహన కల్పించి బీమాల్లో చేర్పించడమే కాకుండా ఇన్సూరెన్స్ సొమ్మును సకాలంలో అందించి బాధితులను ఆదుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ రెండేళ్లు మేనేజర్‌గా తనను ఆదరించినట్లు ఖాతాదారులకు, సామాజిక వేత్తలకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. మండవల్లి మేనేజర్‌గా వచ్చే ముందు భయపెట్టారని, అయితే మండవల్లి ప్రజలు చాలా మంచివారని, గౌరవించి, ఆదరిస్తారని వారు చూపిన ప్రేమను బట్టి తనకు అర్థమైందన్నారు. పనిచేసే ఉద్యోగస్తులను గౌరవించే సంప్రదాయానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దుర్గారావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్.భాస్కరరావు, టి.అప్పారావు, సర్పంచులు మెండ ఝాన్సీ, నాగదాస థామస్‌రాజ సులోచన, కైకలూరు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ చేబోయిన వీర్రాజు, గుడివాడ మురళీకృష్ణ, తంబు స్వామి, పెరుమాళ్ల సత్యనారాయణ, సుబ్బారావు, వెంకన్న, ఇస్సాకు, ముళ్లపూడి సత్తిబాబు, రత్నకుమార్, బేబీ సరోజిని, మెండ సురేష్, రాజేష్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


బ్యాంక్ మేనేజర్ దుర్గారావును సత్కరిస్తున్న ఖాతాదారులు

జంగారెడ్డిగూడెంలో తపస్ విద్యాసంస్థ ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం తపస్ విద్యాసంస్థను చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తపస్ విద్యాసంస్థ ఛైర్మన్ దాకారపు కృష్ణ మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రజాప్రతినిధులకు, రాజకీయ నాయకులకు, పట్టణ ప్రముఖులకు, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు, శ్రేయోభిలాషులకు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ముఖ్య పాత్ర పోషించిన మీడియా ప్రతినిధులందరికీ ధన్యవాదాలు తెలిపారు. తపస్ విద్యాసంస్థలో విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి విద్యార్థులను గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేస్తామన్నారు. విద్యార్థులను అన్ని అంశాల్లో మెరుగ్గా తీర్చిదిద్ది వారు అభ్యున్నతి చెందాలనే మంచి ఉద్దేశంతో తపస్ విద్యాసంస్థ స్థాపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



తపస్ విద్యాసంస్థను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్


తపస్ విద్యాసంస్థ

విద్యార్థికి శ్రీసాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు సమీపంలోని మత్తేవారిగూడెం ఆవాస ప్రాంతానికి చెందిన పంతగాని రవితేజ ప్రస్తుతం ఉపాధి హామీ కూలీగా పని చేస్తున్నారు. ఆయన ఇటీవల నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో 920 మార్కులను సాధించారు. జెఇఇ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో మంచి ర్యాంకు సాధించారు. చదువుపై ఆసక్తి ఉన్నప్పటికీ పరిస్థితులు అనుకూలించని కారణంగా కుటుంబ పోషణ కోసం ఉపాధి కూలీగా మారారు. దళిత సామాజిక తరగతికి చెందిన రవితేజ తండ్రి రామకృష్ణ గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతూ పనిచేసే పరిస్థితుల్లో లేరు. ఇతని తల్లి మానసిక వ్యాధితో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగుండని కారణంగా రవితేజ కుటుంబ పోషణ కోసం ఉపాధి కూలీగా మారారు. ఈ విషయం సేవా దృక్పథంతో భీమడోలు, ఏలూరు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులు సభ్యులుగా ఉన్న శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ దృష్టికి వచ్చింది. ప్రతి నెలా సంస్థ సభ్యులు అందించే విరాళాలతో ప్రతి నెలా వారి పరిధిలోని పేద విద్యార్థులను ఆదుకుంటుంది. కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంటే ఆ కుటుంబానికి సహాయపడుతున్న శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ రవితేజను ఆదుకునేందుకు ముందుకొచ్చింది. సోమవారం సంస్థ కార్యవర్గ సభ్యులు సిహెచ్.శ్రీధర్, డికెఎస్ఎస్.ప్రకాష్, ఉమామహేశ్వరరావు, జి.మోహన్, ఇ.శ్రీనివాస్, జి.శ్రీనివాస్ మత్తేవారిగూడెంలోని రవితేజ ఇంటికి వచ్చారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రవితేజ తన ఇంజినీరింగ్ విద్యను పూర్తి చేసేందుకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు త్వరలో నిర్వహించనున్న జెఇఇ మెయిన్స్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేందుకు రవితేజకు రూ.పది వేల ఆర్థిక సహాయాన్ని గొల్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శనివారపు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పయ్యావుల సాయిబాబా, జి.ప్రకాశరావు చేతుల మీదుగా అందించారు. రవితేజ ఇంజినీరింగ్ పూర్తి చేసేంతవరకు అవసరమైన ఆర్థిక సహాయంతో పాటు ఇతర సహాయాలను అందిస్తామని తెలిపారు. ప్రతిభ గల పేద విద్యార్థులు తమ చదువును కొనసాగించేందుకు సహాయం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థ శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులను పలువురు అభినందించారు.


విద్యార్థికి ఆర్థిక సాయం చేస్తున్న సంస్థ సభ్యులు

విచ్చలవిడిగా మట్టి అక్రమ తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

చెరువులు కోతకు గురయ్యే ప్రమాదముందని స్థానికుల ఆవేదన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

మండలంలోని ఎ.పోలవరంలో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎ.పోలవరం శివారు ఇరిగేషన్ చెరువుల్లో మట్టి తవ్వకాలు ఇష్టానుసారంగా సాగుతున్నాయి. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఇరిగేషన్ చెరువులోని మట్టిని తవ్వి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారని, అయినా రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ చెరువు చుట్టుపక్కల మట్టి తవ్వకాలు విరివిగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు గాని, ఇరిగేషన్ అధికారులు గాని అటువైపు కన్నెత్తి చూడడంలేదని వాపోతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లతో చెరువుల ఇరువైపులా మట్టి తవ్వకాలు సాగిస్తూ మట్టి దందాను సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం అధికార పక్ష నాయకులు వారికేమి పట్టనట్లు నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. మట్టి తవ్వకాలపై అధికారులకు ఫోన్ చేసి వివరించినా చర్యలు తీసుకోవడంలేదని, కనీసం సమాధానం కూడా చెప్పడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ మట్టి తవ్వకాల వల్ల ఇరిగేషన్ చెరువులన్నీ కోతకు గురయ్యే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ మట్టి తవ్వకాలని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


గ్రామంలో మట్టి గుట్టలు



అవగాహనా ర్యాలీలో ఎంఇఒ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

రమణక్కపేటలో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి - ముసునూరు

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరి చదువుతో పాటు ప్రభుత్వం అందించే సకల సదుపాయాలు పొందాలని ముసునూరు మండల విద్యాశాఖాధికారి ఎంవి.సుబ్బారావు తెలిపారు. మండలంలోని రమణక్కపేట గ్రామంలో భవిత సెంటర్ విద్యార్థులతో నేను బడికి పోతా కార్యక్రమంపై సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవిత సెంటర్ ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్

ప్రజాశక్తి - కైకలూరు

అందరి అభిమానానికి తగ్గట్టుగా పని చేసి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వరహాపట్నంలోని ఆయన నివాసం వద్ద టిడిపి కూటమి నేతలు సోమవారం అభినందన సభ నిర్వహించారు. పూలదండలు, బొకేలు వద్దని, నోటు పుస్తకాలు, విద్యార్థులకు అవసరమైన పెన్నులు తీసుకురావాలనే సూచన మేరకు అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పుస్తకాలు తీసుకొచ్చారు. ప్రతి ఒక్కరినీ పలకరించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు కమ్మిలి విఠల్, బొమ్మనబోయిన విజయలక్ష్మి, బలే ఏసురాజు, పూల రాజీ, తేరా రమేష్, కొల్లి బాబి పాల్గొన్నారు.


డ్రెయిన్‌పై కూలిన వంతెనను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్

వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేయాలి

అధికారులను ఆదేశించిన ఎంఎల్ఎ శ్రీనివాస్

కలిదిండి : పోతుమర్రు శివారు పెదకొమ్ముమేరు డ్రెయిన్‌పై కూలిన వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని, అలాగే కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఇటీవల పోతుమర్రు శివారు పెదకొమ్ముమేరు డ్రెయిన్‌పై కూలిన వంతెనను కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ ఇబ్బందులు ఆయనకు వివరించారు. పోతుమర్రు నుంచి తాడినాడ పరిసర ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి తెలిపారు. సమస్యను పరిష్కరించి తమ ఇబ్బందులను తొలగించాలని కోరారు. అనంతరం ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ తాడినాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు, పాదచారులకు, ద్విచక్ర వాహనాలు వెళ్లే విధంగా తాత్కాలికంగా వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొత్త వంతెన నిర్మాణానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. ఆయనతో పాటు టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్లు వల్లభనేని శ్రీనివాస చౌదరి, తాడినాడ బాబు, ఎంపిడిఒ దినతేజ్, సంబంధిత శాఖాధికారులు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని స్వర్ణవారిగూడెం గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం ఉదయం పట్టుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణవారిగూడెం సమీపంలోని కాలువ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు సోమవారం దాడులు చేశారు. ఈ దాడిలో టి.కృష్ణ అనే వ్యక్తి ట్రాక్టర్‌పై ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఆపారు. దీంతో ట్రాక్టర్‌పై ఉన్నవారు కొంతసేపు కార్యదర్శితో వాగ్వివాదానికి దిగారు. అనంతరం ట్రక్‌ను అక్కడ వదిలేసి ఇంజన్‌తో ఉడాయించారు. ఘటనపై కార్యదర్శి సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపారు.


ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్ ట్రక్కు

వృద్ధుని ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు నాలుగు రోజుల అనంతరం వృద్ధుని ఆచూకీ లభ్యమైంది. మండలంలోని దేవరం గ్రామంలో ఈ నెల 13వ తేదీన తాడు తెగొట్టుకుని వెళ్లిపోయిన ఆవును వెతికేందుకు వెళ్లిన వృద్ధుడు దండు శ్రీరామరాజు(76) అదృశ్యమైన విషయం తెలిసిందే. వృద్ధుని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసి ఆచూకీ కోసం గాలిస్తుండగా గుడివాడలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్నట్లు సమాచారం తెలుసుకొని అక్కడికి వెళ్లి చూడగా శ్రీరామరాజు ఆచూకీ లభ్యమైంది. వెంటనే కుటుంబ సభ్యులు వృద్ధుని తీసుకుని దేవరం గ్రామం వచ్చారు. నాలుగు రోజులుగా ఆహారం ఏమి తీసుకోకపోవడంతో వృద్ధుడు బాగా నీరసించిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే అతనిని కుటుంబ సభ్యులు స్వగ్రామైన పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం పాగోల్లు పంపించినట్లు తెలిపారు.

పంట బోదెలో పడి రైతు మృతి

చినగొన్నూరులో విషాదఛాయలు

ప్రజాశక్తి - ముదినేపల్లి


వంటబోదెలో పడి రైతు మృతి చెందాడు. వివరాలు ప్రకారం... గుడ్లవల్లేరు మండలం చినగొన్నూరుకు చెందిన రైతు బేతపూడి డేవిడ్‌రాజు(50)కు ముదినేపల్లి మండలం దేవరం గ్రామంలో ఆక్వా చెరువులు ఉన్నాయి. ఈ నెల 14వ తేదీ శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో రొయ్యల చెరువులో మేత చల్లేందుకు ఇంటి నుంచి బైక్‌పై చెరువు వద్దకు బయలుదేరాడు. ఈ క్రమంలో మండలంలోని కాకరవాడ శివారు దేవరం సమీపంలో డేవిడ్‌రాజుకు మూర్ఛ రావడంతో బైకు పైనుంచి పక్కనే ఉన్న పంట బోదెలో పడిపోయాడు. డేవిడ్ రాజు తల బురదలో కూరుకుపోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వెళ్తున్న ఓ మహిళ చూసి స్థానికులకు తెలియజేయడంతో దేవరం గ్రామస్తులు వచ్చి డేవిడ్ రాజును బయటికి తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. డేవిడ్ రాజు మరణంతో చినగొన్నూరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

డ్రెయినేజీ నిర్మించండి సారూ..!

గోపాల్‌నగర్ కాలనీ వాసుల ఆవేదన
మురుగు నీరు వెళ్లే మార్గం లేక అవస్థలు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- కామవరపుకోట


వాడుకున్న మురుగు నీరు బయటకు వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పలపాడు పంచాయతీ పరిధిలోని గోపాల్ నగర్ కాలనీలో సుమారు 120 వరకు ఆవాస గృహాలు ఉన్నాయి. ప్రజలు వాడుకున్న మురుగు నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ లేదు. దీంతో ఆ కాలనీలో ప్రజలు వాడుకున్న మురుగు ఎక్కడ పడితే అక్కడే ఆగిపోయి కాలనీ పరిసరాలు ఆపరిశుభ్రంగా మారుతున్నాయి. ఈ రకంగా మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన కూడా వెదజల్లుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు మురుగు నీరు నిల్వ ఉండడంతో రానున్న వర్షాకాలంలో తాము అనేక రకాలైన ఇబ్బందులు, వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించేందుకు అవకాశం ఉన్న దృష్ట్యా తమ కాలనీలో వాడుకుంటున్న మురుగునీరు బయటకు వెళ్లేందుకు వెంటనే కాలువలు తవ్వి డ్రెయినేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై మురుగునీరు


మురుగుకాల్వలో మురుగునీరు

అధికారులు స్పందించాలి

ఆడమిల్లి లక్ష్మీనారాయణ, మాజీ వార్డ్ మెంబర్



మురుగు నీరు వెళ్లకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వర్షాకాలంలో మరిన్ని అవస్థలు, రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి తమ కాలనీలో కాలువలు తవ్వి డ్రెయినేజీలు నిర్మించాలి.

ఈదురుగాలులకు ఎగిరిపడిన రేకులు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలంలో ఆదివారం సాయంత్రం భారీ ఈదురుగాలులతో వర్షం వర్షం కకలావికలం చేసింది. గాలి అధికంగా వీయడంతో మండలంలోని ముక్కంపాడు గ్రామంలో డాబాలపై ఉన్న షెడ్డులపై రేకులు ఎగిరిపోయాయి. కోడూరి బుచ్చిబాబు, గోకవరపు మంగమ్మ, కోడూరి సత్తిబాబులకు చెందిన షెడ్డులపై రేకులు గాలికి ఎగిరి పడ్డాయి. దీంతో వారికి కొంత మేర నష్టం వాటిల్లింది. భారీగా ఈదురుగాలులు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.


విరాళం అందిస్తున్న సుధీర్, కనకవల్లి దంపతులు

శ్రీవారి విమాన గోపుర స్వర్ణమయ పథకానికి విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయం విమాన గోపుర స్వర్ణమయ పథకానికి రూ.4.13 లక్షలు ఐసిఐసిఐ బ్యాంక్ కొండాపూర్ బ్రాంచ్ చెక్కు ద్వారా విరాళం అందించారు. హైదరాబాద్‌కు చెందిన కాకులపాటి సుధీర్, కనకవల్లి దంపతులు ఆలయ కార్యనిర్వాహణాధికారి వేంద్ర త్రినాథరావుకు అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామి వారు అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం వారు అన్నదానం బాండ్ పేపర్స్, స్వామి వారి ప్రసాదాలు అందించారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి


రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న వేణుమాధవ్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఖరీఫ్ సాగుదారులంతా ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి బొర్రా వేణుమాధవ్ అన్నారు. మండలంలోని పెదపాలపర్రు గ్రామంలో సోమవారం రాయితీపై రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంటియు 1061, ఎంటియు 1018 వరి విత్తనాలు 30 కేజీల బస్తా రూ.1044కే రాయితీపై ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులందరూ విత్తనాలను విత్తన శుద్ధి చేసుకోవాలని, దీనివల్ల మొదటి 30 రోజుల వరకు పురుగుల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గంటా రాకేష్‌కుమార్, రైతులు ఎం.జగన్‌మోహన్‌రావు, సిహెచ్.వెంకటరమణ ప్రసన్నకుమార్, ప్రసాద్, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం పోరాడాలి

రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలి
సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జీవరత్నం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కృషి చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. పట్టణంలోని స్థానిక అశ్వరావుపేట రోడ్డులో ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో సిపిఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతులు పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.జీవరత్నం మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరానికి నిధులు తీసుకురావడానికి, రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయారని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వటంలో గత ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. కార్మికులకు జీతాలు పెంచి పర్మినెంట్ చేయాలని, ఉపాధి హామీ చట్టంలో 200 రోజులు కల్పించి రూ.600 వేతనం ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కమిటీ సభ్యులు జోడి సూర్యచంద్రరావు, జి.సూర్యకిరణ్, అందుగుల ప్రభాకరరావు, యాగంటి సీత, ఎస్‌కె.సుభాషిణి, వి.గోపీ పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా బక్రీద్ వేడుకలు


ఏలూరులో...


ప్రజాశక్తి - ఏలూరు టౌన్

బక్రీద్ పండుగ సందర్భంగా స్థానిక పడమర వీధి పాల తూము సెంటర్‌లో ఉన్న మసీదులో నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు నమాజ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మసీదు సభ్యులను ఉద్దేశించి పెదబాబు మాట్లాడుతూ నగరంలోని పలు మసీదుల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. పాలతూము సెంటర్ మసీదుకు మెయిన్ బజార్‌లో ఉన్న షాపు శిథిలావస్థలో ఉందని, ఆ షాపును పున:నిర్మించడానికి తాను సహకరిస్తానని పెదబాబు చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మసీదు పెద్దలు, సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబును అభినందించారు.

భీమడోలు : బక్రీద్‌ను త్యాగానికి ప్రతీకగా భీమడోలు మహమ్మదీయ మసీదు కమిటీ ఛైర్మన్ షేక్ హసేన అభివర్ణించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. భీమడోలు మసీదులో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలను మసీదు కమిటీ ఛైర్మన్ పర్యవేక్షించారు. ఇదేవిధంగా గుండుగొలను, పాతూరు, గండివారిగూడెం, పోలసానిపల్లి, అంబరుపేట, పూళ్ల గ్రామాల్లోని మసీదుల్లో నిర్వహించిన కార్యక్రమాలతో వందలాదిగా ముస్లింలు హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వారిని అభినందించారు.

టి.నరసాపురం : మండలంలో బక్రీద్‌ను ముస్లిం సోదరులందరూ సోమవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రధానంగా మండలంలోని టి.నరసాపురం, ఎపిగుంట, బొర్రంపాలెం, వెంకటాపురం, అప్పలరాజుగూడెం, మక్కినవారిగూడెం, తెడ్లం గ్రామాల్లోని మసీదుల్లో నమాజ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపుకుంటున్నట్లు వారు తెలిపారు. పేద ధనిక తారతమ్యాలు లేకుండా రాగ ద్వేషాలకు అతీతంగా జరుపుకొనే పండుగ బక్రీద్ అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ బాషా, కాసిం, షేక్ జాకీర్ హుస్సేన్, పాచా, మీరా, హుస్సేన్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : బక్రీద్ వేడుకలను మండల కేంద్రమైన ఆగిరిపల్లితో సహా పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆగిరిపల్లిలోని జామీయా మసీదు వద్ద ఉన్న ఈద్గా వద్ద పెద్ద ఎత్తున జామీయా మసీదు, మక్కా మసీదుకు చెందిన ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జామీయా మసీదు అధ్యక్షులు షేక్ చాన్‌బాషా, మక్కా మసీదు అధ్యక్షులు షేక్ గౌస్, మత గురువులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.


భీమడోలులో...

కలిదిండి : బక్రీద్ పండుగను పురస్కరించుకుని స్థానిక బస్టాండ్ సమీపంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు పండుగ ప్రాముఖ్యతను వివరించారు. చిన్న మసీదు, పెద్ద మసీదు, మిలటరీ పేట మసీదు పరిధిలోని ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గురజ, సంకర్షణపురం, పెయ్యేరు, ముదినేపల్లి గ్రామాల్లోని మసీదుల్లో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు చేరి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సాంఘిక భద్రత కార్మికుల ప్రధాన హక్కు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ముసునూరు మండల కన్వీనర్ బుడుపుల జయశ్రీ

ప్రజాశక్తి - ముసునూరు

సాంఘిక భద్రత కార్మికుల ప్రధాన హక్కుగా పేర్కొని గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ముసునూరు మండల కన్వీనర్ బుడుపుల జయశ్రీ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో సోమవారం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం చెప్పిన విధంగా కార్మికులకు కనీస వేతనం రూ.850 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనారోగ్యం పాలైన కార్మికులకు ప్రభుత్వమే వైద్యం చేయించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారి హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ యూత్ కన్వీనర్ బుడుపుల యశస్విని, టి.ఆదిలక్ష్మి, ఎం,బేబి, సిహెచ్.పద్మ, టి.పంగిడియా, పి.రాజా, కార్మికులు పాల్గొన్నారు.

ఊక లోడు లారీలతో ట్రాఫిక్ జామ్

వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఊకను తరలించే లారీలతో ఉంగుటూరు రైల్వే గేటు మార్గంలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. లారీల్లో పరిమితికి మించి బరకాలను లారీ చుట్టూతా కట్టి పొట్టలు బయటకి వచ్చేలా ఊకను కుక్కేసిన లోడు లారీలతో ద్విచక్రవాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేటును దాటి వెళ్లే క్రమంలో అనేక సార్లు సిగ్నల్ వ్యవస్థకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి. నాలుగు మీటర్ల వెడల్పు అయిన రోడ్డులో లారీలో పొట్టలు బయటకు వచ్చి రోడ్డంతా లారీ ఆక్రమించేస్తున్నాయి. లారీ రోడ్డు మీద ఆగితే దాని పక్క నుంచి కనీసం సైకిలిస్టులు కూడా ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉంది. రెండు లారీల్లో పట్టే ఊకను ఒక లారీల్లో లోడింగ్ చేయడమే అసలు కారణమని గ్రామస్తులు చెబుతున్నారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసులు అలాంటి లారీలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అదనంగా లోడు చేసిన లారీలు అనేక ప్రమాదాలకు కారణమవుతున్నాయని చెబుతున్నారు. లారీ వెళ్తుండగా చిరిగిన బరకాల్లోంచి ఊక గాల్లో ఎగురుతూ వెనకాల వచ్చే ద్విచక్రవాహనదారుల కళ్లల్లో పడి చాలా మంది కంటి సమస్యలతో బాధలు పడుతున్నామన్నారు. ఊకపై గరుకైన రేణువులు కంటిలో పడితే రెటీనా దెబ్బతిని చూపుపై ప్రభావం పడే అవకాశం ఉందని కంటి వైద్యులు చెబుతున్నారు. చాలా సార్లు రైల్వే అధికారులు కూడా లారీ వాళ్లకు చెప్పిన ఫలితం ఉండటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.


పరిమితికి మించి అధికంగా ఊక లోడుతో వెళ్తున్న లారీ

నేడు అన్న సమారాధన

ప్రజాశక్తి ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల గ్రామం తూర్పు వీధిలో ఉన్న శ్రీ కళ్యాణ రామాలయం వద్ద శ్రీ సీతారామ లక్ష్మణ సమేత శ్రీ దాసాంజనేయ స్వామి వారికి హనుమజ్జయంతి పురస్కరించుకుని మంగళవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ద్వారకాతిరుమల నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యుల నిర్వహణలో అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నారని, అందరూ పాల్గొని స్వామి వారి ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

'నూతన ప్రభుత్వం కల్లుగీత కార్మికులను ఆదుకోవాలి'

ప్రజాశక్తి - తణుకు

కల్లుగీత కార్మికులకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉండేలా 1991లో పోరాడి సాధించుకున్న కల్లుగీత ఆర్థిక కార్పొరేషన్‌ను పునరుద్ధరించి, నిధులు కేటాయించాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం స్థానిక అమరవీరుల భవనంలో జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అక్రమ మద్యం ఆదాయం కోసం గీతవృత్తిని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. 2014లో ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలు ఏఒక్కటీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త విధానాలతో లక్షలాది మంది గీత కార్మికుల ఉపాధిని దెబ్బ తీశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర చొరవ చేసి కల్లుగీత వృత్తిని కాపాడాలని కోరారు. కల్లు కేన్సర్, డయేరియా, పొంగు వంటి వ్యాధులకు ఔషధంలా పనిచేసే గుణాలతో ఉంటుందని, ఆరోగ్యవంతమైన పోషకాలు అనేకం ఉన్నాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారని గుర్తు చేశారు. అటువంటి ఆరోగ్యకరమైన కల్లును రక్షించాలని కోరారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా గీతవృత్తిని ఆధునీకీకరించి ప్రోత్సహించాలని, లక్షలాది గీతన్నల కుటుంబాలకు సామాజిక భద్రత, ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ బోగస్ కుల కార్పొరేషన్లను తక్షణం రద్దు చేసి గీత కార్మికులందరికీ గతంలో ఉన్న విధంగా ఒకే కార్పొరేషన్‌ను కొనసాగించాలన్నారు. కూటమి ప్రభుత్వం గీత కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. ఆదరణ పథకం పునరుద్ధరించి గీత కార్మికులకు ద్విచక్ర వాహనాలు, ప్రమాదాలు తగ్గించేందుకు సేఫ్టీగా ఉండే మోకులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కడలి పాండు, జిల్లా సహాయ కార్యదర్శి దాసరి సూరిబాబు, బొంతు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పిల్లి ఏడు కొండలు, దొంగ సత్యనారాయణ, ఎ.శ్రీనివాస్, చింతపల్లి చిన్నవీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల స్వీకరణెప్పుడో..!

ఎన్నికల కోడ్ పేరిట నిలిచిన 'స్పందన'
కోడ్ తొలగినా ప్రారంభం కాని వైనం
వచ్చే సోమవారమైనా ప్రారంభమయ్యేనా అని జనం ఎదురుచూపు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రతి సోమవారం గ్రామ సచివాలయం, మండల కేంద్రం, డివిజన్ కేంద్రం, కలెక్టరేట్ ఇలా పలుచోట్ల సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించేవారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరిం చేవారు. మరికొన్నింటిని నిర్ణీత గడువులో పరిష్కరిం చేవారు. పోలీసు శాఖలోనూ ఇదేవిధంగా కింద నుంచి జిల్లాస్థాయి వరకూ ఫిర్యాదులు స్వీకరించేవారు. దీంతో ఆయా కార్యాలయాలకు జనం క్యూ కట్టేవారు. గ్రామ సచివాలయాల స్థాయిలో ఎలాగున్నా మండల, డివిజన్, జిల్లాస్థాయిల్లో జరిగే కార్యక్రమాలకు జనం బారులు తీరేవారు. సమస్యల పరిష్కార స్థాయి ఎలాగున్నా తమ సమస్య అధికారులకు చెప్పుకున్నామన్న సంతృప్తి అర్జీదారుల్లో ఉండేది.

అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో మార్చి 11 తర్వాత స్పందన కార్యక్రమం రద్దు చేశారు. మార్చి 16 నుండి జూన్ ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సంగతి తెలిసిందే. కొత్త ప్రభుత్వం జూన్ 12న ప్రమాణస్వీకారం చేసింది. దీంతో జూన్ 10న అర్జీల స్వీకరణ చేపట్టలేదు. జూన్ 17న బక్రీద్ సెలవు కావడంతో ఇప్పటికీ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ ప్రారంభం కాలేదు. అయితే ఇవేమీ తెలియని అర్జీదారులు ఎన్నికలైపోయాయిగా అంటూ అర్జీలిచ్చేందుకు ఆయా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రతి సోమవారం అర్జీల స్వీకరణ ఎప్పుడు ప్రారంభమవుతుందనేది అధికారులు సైతం ఇప్పటి వరకూ అధికారికంగా ప్రకటించకపోవడం గమనార్హం. స్పందన కార్యక్రమంలో ఎక్కువగా పొలాల సర్వే చేపట్టాలని, అర్హులైన తమకు ప్రభుత్వ పథకాలు రావడం లేదని, ఇళ్ల స్థలాలు, పెన్షన్లు ఇవ్వాలని, స్థానిక సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందేవి.

ప్రభుత్వం మారినప్పుడల్లా ఈ కార్యక్రమం పేరు, విధి విధానాలు మారుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజావాణిగా, 2014 నుంచి 2019 వరకూ టిడిపి ప్రభుత్వంలో 'మీ కోసం', 2019 నుంచి స్పందన కార్యక్రమంగా పిలిచారు. పేరు మారినా కొన్ని సమస్యలు మాత్రం అపరిష్కృతంగానే ఉంటున్నాయనేది వాస్తవం. తాజాగా ప్రజా ఫిర్యాదులు పరిష్కార వ్యవస్థగా ప్రభుత్వం పేరు మార్చింది. అత్యంత కీలకమైన అర్జీల స్వీకరణ కార్యక్రమంలో వచ్చే సోమవారం నుంచైనా ప్రారంభమవుతుందో లేదో వేచిచూడాలి.